క్లుప్తంగా

సేవాగుణం అభినందనీయం



బయోమెట్రిక్ డివైజ్‌లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : సేవా గుణం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే జి.వి.శ్రీనాథరెడ్డి అన్నారు. గురువారం స్థానిక బండ్లవంక 2వ గ్రామ సచివాలయానికి సచివాలయ కన్వీనర్ ఎం. సునీల్‌కుమార్‌రెడ్డి రూ.40 వేల విలువైన 15 కుర్చీలు, గ్రామ వలంటీర్లకు 10 బయోమెట్రిక్ డివైజ్‌లు, సీఎం చిత్రపటం, ఇతర సామగ్రి వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జి.వి. శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ గ్రామ సచివాలయ సేవలు మరింత విస్తృతం చేయడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం శంకరాపురం, బి.వి.రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వ పథకాలపై వివరిస్తూ, ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తూ పర్యటన సాగింది. కార్యక్రమంలో జి.వి.రాకేష్‌రెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా, ఉదయ్, ఆనంద్, కాలేషా, కృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సాయి, జనార్ధన్‌రెడ్డి, జహంగీర్, నాగభూషణం, శ్రీనాథరెడ్డి, జయపాల్‌రెడ్డి, షాకీర్, నరేష్‌రామ్‌కుమార్‌రెడ్డి, ప్రభావతి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.25కే జాతీయ జెండా

వాల్మీకిపురం: పంద్రాగస్టు సందర్భంగా వాల్మీకిపురం పోస్టాఫీసులో హర్ ఘర్ తిరంగా 2.0 కార్యక్రమంలో భాగంగా రూ.25కే జాతీయ జెండాను అందిస్తున్నట్లు పోస్ట్ మాస్టర్ నిరంజన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జెండాలను పోస్టాఫీసులో వినియోగదారులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, ప్రైవేటు సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యాసామగ్రి వితరణ

తంబళ్లపల్లె: మండలంలోని బేల్దారివారిపల్లె యూపీ పాఠశాలలో విద్యార్థులకు మదనపల్లె వ్యాపారి గార్ల గోపాలక్రిష్ణ (శాంతారామ్), జయశ్రీ దంపతులు విద్యాసామగ్రిని వితరణగా ఇచ్చారు. గురువారం పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈవో–2 నాగసుబ్బరాయుడు అతిథిగా వచ్చారు. నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు, రబ్బర్లు, పలకలు 1వ తరగతి నుంచి 7వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్నెమడుగు హెచ్‌ఎం మదన్మోహన్, ఎస్‌విజి బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ హరినాథ్‌శర్మ, చంద్ర, రిటైర్డ్ హెచ్‌ఎం జివి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

మదనపల్లె సిటీ: ఏపీఎన్జీవోఎస్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ అసోసియేషన్ మదనపల్లె తాలూకా అధ్యక్షులు నరసింహారెడ్డి అన్నారు. గురువారం పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడలో 21,22 తేదీల్లో ఇందిరా గాంధీ స్టేడియంలో సభలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీలు విశ్వేశ్వరరెడ్డి, రంగయ్య, యూనియన్ నాయకులు నజీర్, రేఖా, గీతాంజలి, చెంగల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలి

మదనపల్లె సిటీ: ఉద్యోగులందరూ కలిసి ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేంద్రనాథ్ అన్నారు. గురువారం డిపో కార్యాలయంలో ఆదర్శ ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. ఉద్యోగులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడిఉండాలన్నారు. డిపో ఆదాయం పెంచాలన్నారు. ట్రాఫిక్ విభాగంలో బి.వి.నాయక్, మెయింటెన్స్‌లో మురళి, ఎస్‌ఎం భాషా, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లు రఫీ, రామకృష్ణలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వాల్మీకిపురం : పడమర పాలిమేర ధర్మపథంలో శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో గురువారం శ్రీ వల్లిదేవ సేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలోని కల్యాణ మండపంలో షిరిడిసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేదపండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, ఉత్సవ మూర్తుల అలంకరణ చేశారు. అనంతరం వల్లిదేవ సేన సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మురళీమోహన్, సారధి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

పెద్దతిప్పసముద్రం : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 5 నుంచి మండలంలోని తుమ్మరకుంట పంచాయతీలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం సామాడుపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, గజ్జెలవారిపల్లి గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. కుల, మతాలకు అతీతంగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి భక్తులు, దూర ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. మరో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు జరుగుతాయని పంచాయతీ ప్రజలు పేర్కొన్నారు.

మాతృభూమికి వందనం

- ఘనంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్



మదనపల్లె : తట్టివారిపల్లెలో మాజీ సైనికులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు



తంబళ్లపల్లె: ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీవో ధనలక్ష్మి

మదనపల్లె : దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆజాదీకా అమృత్ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగా పంచాయతీల్లో జరుగుతున్న కార్యక్రమాల్లో పాల్గొని మాతృభూమికి వందన సమర్పణ చేయాలని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని అంకిశెట్టిపల్లె, బసినికొండ, చిన్నతిప్పసముద్రం, సీటీఎం క్రాస్‌రోడ్, కొండామర్రిపల్లె, కోటవారిపల్లె, నారమాకులతండా, తట్టివారిపల్లె, వలసపల్లె పంచాయతీల్లో నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం– వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన సైనికులను స్మరించుకుంటూ శిలాఫలకాలను ఆవిష్కరించారు. పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. వసుధకు వందనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీళ్లు పోశారు. వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా తట్టివారిపల్లెలో మాజీ సైనికులైన ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, బి.మదన్‌మోహన్‌రెడ్డి, బి.బలరాంరెడ్డి, బి.రామమోహన్‌రెడ్డి, యు.చిన్నప్ప, డి.నరేంద్ర, టి.వెంకటరమణ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధలదీపా, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధలవేమారెడ్డి, నాగరాజరెడ్డి, ఏపీఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆజాదీకా అమృత్ మహోత్సవాలను రెడ్డికోట, కుక్కరాజుపల్లె, కోటకొండ, ఎగువసుగాలి తండా, రేణిమాకులపల్లె, మర్రిమాకులపల్లె పంచాయతీలలో నిర్వహించారు. కుక్కరాజుపల్లెలో నా భూమి–నాదేశం శిలాఫలకాన్ని డీపీవో, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమాలలో ఎంపీటీసీ కవిత, సర్పంచులు నాగమణి, అరుణ, తులసమ్మ, కె.జ్యోతి, రామ్‌రాజ్, ఎంపీడీవో సురేంద్రనాథ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు శ్రీరాములు, తాశ్లచంద్రశేఖర్, శంకర్‌నాయక్, రెడ్డికోట రామస్వామి, మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: దేశం కోసం సేవచేసిన వీరులను స్మరించుకోవాలని ఎంపీడీఓ శంకరయ్య అన్నారు. మండలంలోని బడికాయలపల్లె, బీరంగి, గుడిపల్లె గ్రామ పంచాయతీలలో నా మట్టి –నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆజాదీ కా అమృత్‌మహోత్సవం గురించి, శిలాఫలకాలు ప్రారంభించడం, పంచ్ ప్రాణ ప్రతిజ్ఞ గురించి అధికారులు గ్రామసభలో ప్రజలకు వివరించారు. బి.కొత్తకోట మండలంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చేసిన అభివృద్ధి పనులు గురించి గ్రామసభలో తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, సర్పంచులు అదెన్న, గిరిజ రఘునాథరెడ్డి, వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు పద్మజ, మానస, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం: మండలంలో నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దమండ్యం ఎమ్మార్సీ భవనం వద్ద ఏర్పాటు చేసిన నాభూమి–నాదేశం శిలాఫలకాలను ఎండిసి అధ్యక్షుడు గుర్రం రమేష్, ఎంపీడీవో శ్రీధర్‌రావులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపిడి నందకుమార్‌రెడ్డి, ఈవోపీఆర్‌డి జనార్ధన్, సర్పంచ్‌లు సోదనపల్లె బాషా, పద్మావతమ్మ, మండల జీఎస్‌వి కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు జగన్‌మోహన్, సోముశేఖర పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మడుమూరు, పులికల్లు గ్రామాల్లో సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరత్నమ్మ, గిరీష్, భాస్కర్ నాయుడు, ఆనంద్‌రెడ్డి, ఉత్తన్న, శ్రీనివాసులురెడ్డి తదితరులు మొక్కలు నాటి నా భూమి–నా దేశం శిలా ఫలకాలను ఆవిష్కరించారు.

కేవీపల్లె : మండలంలోని సొరకాయలపేటలో నా భూమి – నా దేశం శిలాఫలకం ఆవిష్కరించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పాత్తప్ప సతీష్‌రెడ్డి, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీ బంగారమ్మ, పంచాయతీ కార్యదర్శి గీత పాల్గొన్నారు.

కలికిరి : మండలంలోని కలికిరి, మేడికుర్తి, అద్దవారిపల్లి గ్రామ పంచాయతీలలో నా మట్టి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల పరిధిలో శిలాఫలకాలు ఆవిష్కరించి, త్రివిధ దళాలలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన వారిని సన్మానించారు. కార్యక్రమాలలో ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ గంగయ్య, సర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, నాగవేణి, గంగయ్య, ఎంపీటీసీ సభ్యుడు అల్లాబక్షు, సావిత్రిప్రదీప్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, వైద్యాధికారిణి కావ్యగంధ, ఏపీఓ సుజాత, ఐటీబీపీ, సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్ అధికారులు, జవాన్‌లు, సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు.

పీలేరు : మండలంలోని మేళ్లచెరువు, తలపుల, జాండ్ల, ముదుపులవేముల, కావలిపల్లె గ్రామాల్లో ఎంపీడీవో ఆధ్వర్యంలో నేలతల్లికి నమస్కారం.. వీరులకు వందనం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరీష, నాయకులు వెంకటరమణనాయుడు, బీబీజాన్, ఏపీవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కురబలకోట : మండలంలోని కనసానివారిపల్లె సచివాలయంలో సర్పంచ్ ఆర్కే కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ బి.దస్తగిరి స్వాతంత్య్ర సమరయోధులను, అమర వీరుల త్యాగాన్ని స్మరిస్తూ శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దిలీప్‌కుమార్, ఏపీఓ వెంకటేష్, కార్యదర్శి చంద్రకళ, ఇంజినీరు ప్రవీణ్, వన్ను కొండారెడ్డి పాల్గొన్నారు.

రామసముద్రం : ఆర్.నడింపల్లి, పెద్దకురప్పల్లె, నారిగానిపల్లి, చెంబకూరు, ఎలకపల్లి, కమ్మవారిపల్లి, ఎలవానెల్లూరు పంచాయతీల్లో వసుధకు వందనం కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీవో నారాయణస్వామి, సర్పంచ్‌లు రెడ్డెప్పనాయుడు, ఉదయ్‌శంకర్‌రెడ్డి, నవనీత, ఆది, చరణ్, ఏపీవో గౌరిశంకర్, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలకడ : మండలంలోని బాలయ్యగారిపల్లె, కలకడ, కె.బాటవారిపల్లె, కె.దొడ్డిపల్లె పంచాయతీలలో ఏర్పాటు చేసిన నాభూమి–నాదేశం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎంపీపీ శ్రీదేవి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఎంపీఓ పరమేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు షావత్‌అల్లీఖాన్, ప్రకాష్‌రెడ్డి, ఆర్‌వి, ఏపీఓ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : మండలంలోని నిమ్మనపల్లెలోఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శేషగిరిరావు మొక్కలు నాటారు. వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, ఏపీఓ రమేష్, ఈఓపీఆర్డీ చలపతిరావు, సర్పంచులు చంద్రాయుడు, వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, మంజునాథ్, లోకేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు

- గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ప్రభుత్వ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గురువారం నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయతీ సర్పంచ్ జి.శ్రీవాణి ఆధ్వర్యంలో చిన్నల్లవారిపల్లె, సైదాపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పథకాల అమలుతీరు, సమస్యలపై ప్రజలను ఆరా తీశారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతిరహిత పాలన అందిస్తున్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు సిఫార్సు చేసిన వారికే లబ్ధి చేకూరేదని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కుల,మత,పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ తదితర ప్రజా ఉపయోగకరమైన పథకాలు నిష్పక్షపాతంగా అందిస్తూ ప్రజలకు ఆర్థికభరోసా కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, చంద్రాయుడు, నాయకులు నవీన్, వెంకటరమణ, శ్రీనివాసులుశెట్టి, యుగంధరరెడ్డి, నరేంద్రరెడ్డి, సురేంద్రరెడ్డి, హోటల్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్‌లకు భూమిపూజ

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బాలినాయునిపల్లె ప్రజల కోరిక మేరకు గ్రామంలో బస్‌షెల్టర్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. గత కొన్నేళ్లుగా బస్‌షెల్టర్ నిర్మాణంకు సంబంధించి నెలకొన్న వివాదంపై ఎమ్మెల్యే స్పందించి పరిష్కరించారు. నిర్మాణస్థలంలోని ఆక్రమణలను తొలగింపజేసి ప్రజల కోరికను తీర్చారు.

సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల దాఖలు



పెద్దమండ్యం : సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేస్తున్న సుధాకర

పెద్దమండ్యం : మండలంలోని గుర్రంవాండ్లపల్లె సర్పంచ్ స్థానానికి ఒక నామినేషన్, వెలిగల్లు గ్రామంలోని 6వ వార్డుకు ఒక నామినేషన్ దాఖలైనట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు తెలిపారు. సర్పంచ్ స్థానానికి గ్రామ పరిధిలోని బత్తినగారిపల్లెకు చెందిన బి.సుధాకర నామినేషన్ వేసినట్లు పేర్కొన్నారు. అలాగే వెలిగల్లులోని 6వ వార్డుకు అమీన్‌పీర్ నామినేషన్ వేసినట్లు వెల్లడించారు.

కేవీపల్లె : మండలంలోని తువ్వపల్లె పంచాయతీ 5వ వార్డు మెంబరు స్థానానికి ఒక నామినేషన్ దాఖలైనట్లు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి తెలిపారు. గురువారం తువ్వపల్లెకు చెందిన బేతపూరి సుధారాణి నామినేషన్ దాఖలు చేశారు.

పెద్దతిప్పసముద్రం : గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు చివరి రోజైన గురువారం నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి నారాయణ పేర్కొన్నారు. మండలంలోని రాపూరివాండ్లపల్లి, తుమ్మరకుంట పంచాయతీల్లోని ఖాళీగా ఉన్న ఒక్కో వార్డుకు సింగిల్ నామినేషన్ మాత్రమే దాఖలైందన్నారు. మల్లెల పంచాయతీలో ఒక్క వార్డుకు మాత్రం రెండు నామినేన్లు దాఖలయ్యాయన్నారు.

తంబళ్లపల్లె: మండలంలోని ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల ఉప ఎన్నికకు గురువారం మూడు నామినేషన్లు వచ్చినట్లు ఆర్‌వో త్యాగరాజు తెలిపారు. తంబళ్లపల్లె 11వ వార్డుకు లక్ష్మీదేవి, ఎద్దులవారిపల్లె 2వ వార్డుకు కె.మదనకుమారి, కోటకొండ 7వ వార్డుకు చినపాపమ్మలు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్‌వో తెలిపారు.

రామసముద్రం: మండలంలో వార్డుమెంబర్ల పోటీలకు ఐదు నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీవో నారాయణస్వామి తెలిపారు. రామసముద్రం 11వ వార్డుకు శిరీష, ఎలవానెల్లూరు 2వ వార్డుకు సి.రత్నమ్మ, ఆర్.నడింపల్లి 4వ వార్డుకు పి.పాపులమ్మ, రాగిమాకులపల్లె 1వ వార్డుకు ఎం.రాజేష్ , చొక్కాండ్లపల్లి 2వ వార్డుకు ఏ.రమణారెడ్డిలు నామినేషన్లు వేసినట్లు పేర్కొన్నారు.

కలికిరి: మండలంలోని గుట్టపాళెం గ్రామ పంచాయతీ 5వ వార్డు, పల్లవోలు గ్రామ పంచాయతీ పరిధిలో 2వ వార్డుకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలైందని రిటర్నింగ్ అధికారి జి.నాగార్జున తెలిపారు. గుట్టపాళెం గ్రామం 5వ వార్డు సభ్యుడుగా సుధా రామచంద్రయ్య, పల్లవోలు గ్రామం 2వ వార్డు సభ్యుడుగా షేక్ గౌష్ బాషా ఏకగ్రీవంగా ఎంపికైన వారిలో ఉన్నారు.

పాఠశాల అభివృద్ధిలో కమిటీ కీలకం



కలకడ : ఆరోగ్య సూత్రాల క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ : పాఠశాలల అభివృద్ధిలో పేరెంట్స్ కమిటీలు కీలమని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ ఎం.సుబ్బారెడ్డి అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తలిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఫార్మెటివ్ పరీక్షలలో విద్యార్థులు సాధించిన ప్రగతిని వివరించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు జెడ్పీ హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. గత కొద్ది రోజులుగా పాఠశాల విద్యార్థులచే తరగతి గదులు, పాఠశాల ఆవరణం ఎలా శుభ్రం చేయిస్తారని పిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ప్రశ్నించారు. తాము ఇలాంటి పనులు చేయబోమని ప్రశ్నించిన పిల్లలకు టీసీలు ఇచ్చి పంపుతామని హెచ్‌ఎం బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తాము పిల్లలను ఎవరినీ బెదిరించలేదని, స్కావెంజర్‌గా ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

కలకడ : విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలకడ ఆదర్శ పాఠశాల విద్యా కమిటీ చెర్మన్ కెఎస్ మస్తాన్ అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన ఆరోగ్యసూత్రాల క్యాలెండర్లు ఆవిష్కరించి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లి, ఆరోగ్యసిబ్బంది, ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



కలికిరి : విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

కలికిరి : నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల ఆరోగ్యానికి పూర్తి రక్షణ లభిస్తుందని, రక్తహీనత సమస్యలు తొలగిపోతాయని డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణ పరిధిలోని ఎంపీపీ మెయిన్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులు మధ్యాహ్న భోజనం తరువాత అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈ మహమ్మద్ రఫీ, హెచ్‌ఎం మురాషా, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె : సీటీఎం గ్రామ పంచాయతీ జెడ్పీహైస్కూల్‌లో ఎంపీపీ రెడ్డెమ్మ, ఎంపీడీఓ భానుప్రసాద్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ సుబ్రహ్మణ్యం, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సచివాలయ, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అల్బెండజోల్ మాత్రలను వేశారు. వార్డు కౌన్సిలర్ ముబీనా విద్యార్థులకు మాత్రలు వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్లు ముదస్సిరాబేగం, పద్మ, డిపిఎం వేణుగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : మండలంలోని అన్ని పాఠశాలల్లో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. 1–2 ఏళ్ల పిల్లలకు సగం మాత్ర, 3–19 ఏళ్ల వారికి ఒక మాత్ర చొప్పున మధ్యాహ్న భోజనం తరువాత పంపిణీ చేశారు. మండలంలో 4478 మందికి గాను 4420 మందికి మాత్రలు పంపిణీ చేసి 95 శాతం పూర్తి చేసినట్లు డాక్టర్లు మునికుమార్, ఆశాలత తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల, రేగళ్ళు పీహెచ్‌సీల పరిధిలో అన్ని పాఠశాలలు, కళాశాలల్లో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో 12,021 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయడం లక్ష్యం కాగా.. 11,663 మందికి పంపిణీ చేసి 97 శాతం ప్రగతి సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఈలు ఉషారాణి, కొండయ్య, పర్యవేక్షకులు ఆదిలక్ష్మీ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లె : మండలంలో 6520 మందికి అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు మండల పరిశీలకులు డాక్టర్ శ్యామల అన్నారు. వగళ్ల కస్తూర్బా గాంధీ పాఠశాలలో అల్బెండజోల్ ప్రిన్సిపాల్ శ్రావణి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్‌బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది మింగించారు. పెద్దతిప్పసముద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మహమూద్, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, ప్రిన్సిపల్ శివకుమారి, పాఠశాలల సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : కేజీబీవీ పాఠశాలలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు ఎంఈఓ ఎం.ఆర్.పద్మావతి, నారాయణతో కలిసి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. ఈనెల 17వతేదీ వరకు విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందిస్తామన్నారు. అందులోభాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాను, లక్ష్మీదేవి, సీహెచ్‌ఓ మల్లిక, ఎంపీహెచ్‌ఈఓ రామచంద్ర, పీహెచ్‌ఎన్ సరోజ, ఏఎన్‌ఎంలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలకడ : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్‌బెండజోల్ మాత్రలు మింగించారు. వీటి వలన ఎలాంటి అనారోగ్యసమస్యలు రావని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, కలకడ, ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ మల్లికార్జున, మోహన్, కిషోర్‌కుమార్ రెడ్డి, యంపీహెచ్‌ఈఓలు జయరామయ్య, వెంకటేశు, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంఈటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ మాన్యం భూముల సర్వే



భూమిని సర్వే చేస్తున్న అధికారులు

గుర్రంకొండ : మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయ మాన్యం భూములను అధికారులు సర్వే చేశారు. గ్రామానికి సంబంధించిన ఈ ఆలయం ఎంతో పూరాతన కాలానికి చెందినది. సదరు ఆలయానికి సంబంధించి సర్వే నంబర్: 575 తోపాటు మరికొన్ని సర్వే నంబర్లలో సుమారు 58.75 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. ప్రస్తుతం ఈ మాన్యం భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఇటీవల గ్రామస్తులు ఈ విషయమై దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఖాజాబీ, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్ తమ సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లారు. స్వామివారి ఆలయ మాన్యం భూములను రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే చేసి గుర్తించారు. భూముల సరిహద్దులను దేవదాయశాఖ అధికారులు రెడ్డికృష్ణ, రెడ్డెప్పనాయుడులకు చూపించారు. మొత్తం భూముల వివరాలు దేవదాయశాఖ అధికారులకు అందజేశారు. అనంతరం మాన్యంభూములను కౌలు చేసుకొంటున్న రైతులను విచారణ చేశారు. దేవదాయశాఖ అధికారులకు తాము కౌలు చెల్లించడం లేదని, కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు కౌలు చెల్లిస్తున్నామని వారు పేర్కొన్నారు. ఏళ్లతరబడి కౌలును వారే వసూలు చేసుకొంటున్నారని రైతులు తెలియజేశారు. తహసీల్దార్ ఖజాబీ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం 58,75 ఎకరాల ఆలయ మాన్యం భూములను సర్వే చేయించి దేవదాయశాఖ అధికారులకు అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రమణయ్య, సర్వేయర్ వినోద్, వీఆర్‌ఏ సురేష్ పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

కలకడ : మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీలో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి తెలిపారు. ఎగువకురవపల్లె, బడ్డిరెడ్డిగారిపల్లె, గాలివీటివారిపల్లె, దిగువపాళ్యెం, గుండావాండ్లపల్లె, దళితవాడ, అవులప్పగారిపల్లె, మొరంమాదపల్లె గ్రామాలలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పర్యటించి ఇంటింటికీ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను తెలియజేసి, ఇంకనూ నెలకొన్న సమస్యలను పరిష్కరించడం జరుగుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని, ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా శంకరంబాడి జయంతి



శంకరంబాడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాల్మీకిపురం: మా తెలుగు తల్లి గీత రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతి వేడుకలను గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని గండబోయనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శంకరంబాడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ శంకరంబాడి సుందరాచారి పలు శతకాలు, నాటకాలు, బుర్రకథలు రాశారని, రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన గీతాంజలిని తెలుగులోకి అనువదించారన్నారు. ఆయన రాసిన మా తెలుగు తల్లి గీతం 1975 మహాసభల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతంగా ఎంపికైందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రెడ్డిమోహన్, ఉపాధ్యాయులు మురళి, శ్రీకాంత్, సోమశేఖర్, ఉషారాణి, సిలార్‌బి, సిరాజున్నీసా, కిషోర్, రూప, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్బీకే తనిఖీ

ములకలచెరువు : మండల కేంద్రంలోని ఆర్బీకే కార్యాలయాన్ని జిల్లా అగ్రికల్చర్ అధికారి బి.చంద్రానాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎరువులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... మండలంలోని ప్రతి రైతు పీయం కిషాన్ నగదు ఖాతాలో జమ కావడానికి ఈకేవైసీ నమోదు చేసుకోవాలని చెప్పారు. 80 శాతం రాయితీతో అందే ఉలవలను ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ కథనం మేరకు... పెద్దమండ్యం మండలం దేవలం తండా సమీపంలో 300 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు.

దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె సిటీ : జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో దివ్యాంగ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి అభినందన కార్యక్రమం జరిగింది. హెచ్‌ఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్ సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫణీంద్ర, ఐఈఆర్‌టీలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

పీలేరు రూరల్ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 50వ ఆవర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పీలేరు డివిజన్‌లో యూటీఎఫ్ పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు సదాశివరెడ్డి మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న చిన్న సంఘాలను, చిన్న విభాగాలను ఐక్యం చేస్తూ యూటీఎఫ్ ఏర్పడిందని తెలిపారు. యూనియన్ ఏర్పాటుకు దాచూరి రామిరెడ్డి, చెన్నపాటి లక్ష్మయ్యల కృషి అభినందనీయమని కొనియాడారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో విజయాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం సాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, రమేష్‌రెడ్డి, శివారెడ్డి, అక్రమ్, చెంగల్‌రాయుడు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవాలి

వాల్మీకిపురం : ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీ స్థితిని తెలుసుకునేందుకు నిర్భయంగా పరీక్షలు చేయించుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్‌ఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఏసీఎస్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సహకారంతో విద్యార్థులకు ఎస్టీడీ, హెచ్‌ఐవీ, ఎయిడ్స్, టిబి వ్యాధుల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఆర్‌ఎస్ సంస్థ ప్రతినిధులు వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రతి వ్యాధికి ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు అందుబాటులో ఉన్నాయని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుదర్శన్, ఆర్‌ఆర్‌ఎస్ సంస్థ సిబ్బంది లతాంజలి, శోభారాణి, అలివేలమ్మ, పాల్గొన్నారు.

ట్రాఫిక్ పునరుద్ధరణ

బి.కొత్తకోట: బి.కొత్తకోట–మదనపల్లె మార్గంలోని కాండ్లమడుగు వద్ద సోమవారం మర్రిచెట్టు కూలిపోయి రోడ్డుకు అడ్డంగా పడిన విషయం తెలిసిందే. దీనితో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. మంగళవారం నుంచి చెట్టును తొలగించే పనులు చేపట్టగా గురువారం పూర్తయ్యాయి. భారీ వృక్షం కావడంతో తొలగించేందుకు సమయం పట్టింది. తర్వాత రాకపోకలు పునరుద్ధరణ అయ్యాయి.